అన్నదాతలందరికీ అందని సాయం

'అన్నదాత సుఖీభవ' కోసం ఏడాదిన్నరగా ఎదురుచూపు ■ మొదటి ఏడాదికి ఎగనామం

నిబంధనల పేరిట కొందరికి కోత ■ ఇనాం రైతులకు వర్తించని పథకం ■ కూటమి ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం


మడ్డిలో వరి నాట్లు వేయడానికి ముందు ట్రాక్టర్‌తో పచ్చి రొట్టను కలియదున్నుతున్న రైతు

పద్మనాభం: అన్నదాతలకు నిరాశే మిగిలింది. పెట్టుబడి సాయం కోసం కూటమి ప్రభుత్వం అందించే 'అన్నదాత సుఖీభవ' పథకం డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎంతో ఆశగా రైతులు ఎదురుచూశారు. రెండేళ్లకు కలిపి ఒకేసారి రూ.40వేలు వస్తాయనుకున్నారు. కానీ ప్రభుత్వం మొదటి ఏడాది డబ్బులు వేయకుండా అరకొరగానే సాయం అందించగా, అదీ రైతులందరికీ అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని 22 పంచాయతీల పరిధిలోని 50 గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో జిరాయితీ రైతులు 7500 మందికి రైతుభరోసా కింద డబ్బులు వేశారు. వీరు కాకుండా కృష్ణాపురం, పద్మనాభం, బీఆర్ తాళ్లవలస పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉన్న ఇనాం భూముల రైతులు 1004 మందికి రైతు భరోసా వేశారు. కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఎగనామం పెట్టింది. రెండో ఏడాది అయినా జిరాయితీ రైతులందరికీ పెట్టుబడి సాయం అందించలేదు. పైగా వారికి కూడా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు కలిపి మొదట విడతగా రూ.7వేలు చెల్లించారు.

మాటతప్పిన 'కూటమి'

తాము అధికారంలోకి వస్తే ఏడాదికి పీఎం కిసాన్ రూ.6వేలు కాకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు చొప్పున ఐదేళ్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులకు ప్రకటించారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా మాట మార్చారు. ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి మూడు విడతలుగా రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది రైతు భరోసా, పీఎం కిసాన్ కింద జిరాయితీ రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు రైతుల ఖాతాల్లో డబ్బులు వేసింది. ఇనాం రైతులకు ఏడాదికి రూ.7,500 రైతు భరోసా అందించి, ఆదుకుంది. కానీ, కూటమి ప్రభుత్వం ఇనాం రైతులకు డబ్బులు వేయలేదు. దీంతో రైతులు మండి పడుతున్నారు.


కృష్ణాపురంలో ఇనాం భూమిలో వేసిన వరి నాట్లు

పెట్టుబడికి అవస్థలు

ఎకరం విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడానికి రూ.25వేలు పెట్టుబడి అవసరం. రైతులు నువ్వు పంట ద్వారా వచ్చిన ఆదాయంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన సాయంతో వరి పంటకు పెట్టుబడులు పెట్టేవారు. అయితే, నువ్వు పంట చేతికందాల్సిన సమయంలో వర్షం కురవడంతో వేళ్ల కుళ్లి పంట దెబ్బ తింది. అయితే, కూటమి ప్రభుత్వం రెండేళ్లు కలిపి పెట్టుబడి సాయం అందిస్తుందనే నమ్మకంతో వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వరినాట్లు వేయడానికి ఉపక్రమించారు. ఇప్పటికే కృష్ణాపురం, మద్ది, తునిపాలెం, విజయానందపురం, పొట్నూరు, అనంతవరం గ్రామాల్లో కొంత మంది రైతులు వరి నాట్లు వేశారు. మిగతా గ్రామాల్లో నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. అయితే, మొదటి ఏడాది పెట్టుబడి సాయం చేయక, రెండో ఏడాది ఇప్పటివరకు రూ.7వేలు మాత్రమే ఇవ్వడంతో అన్నదాతలు మండిపడుతున్నారు.

వెయ్యిమందికి పైగా రైతులకు కోత..

గత ప్రభుత్వం 7500 మంది రైతులకు రైతు భరోసా అందించగా.. కూటమి ప్రభుత్వం 6481మంది రైతులకు మాత్రమే వేసి, 1019 మందికి సాయం అందించకుండా పక్కన పెట్టేసింది. గత ప్రభుత్వం నిబంధనలేవీ విధించకుండా పెట్టుబడి సాయం అందించగా.. కూటమి ప్రభుత్వం మాత్రం పది సెంట్లు తక్కువ కాకుండా ఉండాలని నిబంధన విధించింది. ఈ నిబంధన వల్ల 1019 మందికి సాయం అందలేదు. ఇక ఇనాం రైతులకు అసలు పెట్టుబడి సాయమే అందించలేదు.

మొదటి ఏడాదికి మోసం



నాకు మూడెకరాల భూమి ఉంది. రెండేళ్లు కలిపి అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు వస్తాయని ఆశపడ్డాం. తీరా చూస్తే మొదటి ఏడాది డబ్బులు ఇవ్వకుండా రైతులను మోసం చేశారు. రెండో ఏడాది పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కలిపి రూ.7వేలు మాత్రం బ్యాంకు ఖాతాలో జమ చేశారు. కూటమి ప్రభుత్వం మాట మార్చేసింది. ముందు పీఎం కిసాన్ కాకుండా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. తర్వాత పీఎం కిసాన్ రూ.6వేలతో కలిపి మూడు విడతలుగా రూ.20వేలు ఇస్తామని మాట మార్చేశారు. వర్షాల వల్ల ఫలసాయం అందలేదు. ప్రభుత్వమూ అరకొరగానే వేసింది. దీంతో వడ్డీలకు డబ్బులు తెచ్చి పెట్టుబడి పెట్టాం.

– బి.సన్యాసినాయుడు, జిరాయితీ రైతు, మద్ది

ఇనాం రైతులకూ సాయం అందించాలి



ప్రస్తుత ప్రభుత్వం ఇనాం రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు ఏడాదికి రూ.7,500 చొప్పున రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడికి డబ్బులు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇనాం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలి.

– టి.అప్పల నాయుడు, ఇనాం రైతు, కృష్ణాపురం


తునిపాలెంలో నాట్లు వేయడానికి దమ్ము పెడుతున్న రైతు

క్లుప్తంగా

తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక రాఖీ


మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: తోబుట్టువుల అనుబంధానికి రాఖీపౌర్ణమి అద్దం పడుతుందని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సోదరుల చేతికి కట్టే రక్షా బంధనం సోదరీమణుల కష్టనష్టాల్లో రక్షణగా నిలుస్తుందన్నారు. భీమిలి నియోజకవర్గంలో ప్రతి కుటుంబంలో ఈ పండగ సుఖసంతోషాలను తీసుకురావాలని చిన్నశ్రీను ఆకాంక్షించారు.

నేడు బలరామ జయంతి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదనమోహన మందిరంలో శనివారం సాయంత్రం 7 గంటల నుంచి బలరామ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస ప్రకటనలో కోరారు.

క్రీడల్లో మెరిసిన ఆనందపురం విద్యార్థులు


వేడుకల్లో పాల్గొన్న ఆనందపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: కొమ్మాదిలోని శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ప్రారంభమైన జాతీయ క్రీడా దినోత్సవాల్లో ఆనందపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖోకు సంబంధించి బి.హర్ష, హేమంత్, గౌతమ్..లాంగ్‌జంప్‌లో కిరణ్, వినయ్ పాల్గొన్నారు. మొదటిరోజు జరిగిన 100 మీటర్ల పరుగు పందెంలో చరణ్ మొదటి స్థానం, ఎం.శ్రీను మూడో స్థానం సాధించగా 400 మీటర్ల పరుగు పందెంలో లక్ష్మణ్ మొదటి స్థానం, 800 మీటర్ల పరుగులో గణేష్ మూడో స్థానం సాధించారు. వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జిలను పలువురు అభినందించారు.

కత్తులతో దౌర్జన్యం చేసినా చర్యలేవి?

పోలీసుల తీరుపై బాధితుల ఆవేదన

తగరపువలస: ఈ నెల 1వ తేదీ రాత్రి 11 సమయంలో తమ ఇంటిపై కత్తులు, కర్రలతో దాడి చేసిన వారిపై భీమిలి పోలీసులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని భీమిలి మండలం గొల్లల తాళ్లవలసకు చెందిన విజ్జపు రమణమ్మ వాపోయింది. తనతో పాటు కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారికి పోలీసులు, టీడీపీ నాయకులు అండగా ఉన్నారని ఆమె ఆరోపించారు. తాళ్లవలస పంచాయతీకే చెందిన సూరిబాబు, రాంబాబు, చరణ్, నరేష్, సురేష్, రమణ, రామయ్యమ్మ, రాములు తదితరులు భయాందోళనలు సృష్టించి దాడికి పాల్పడ్డారని ఆమె ఆరోపణ చేశారు. తీవ్ర గాయాలతో భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్సీ చేయించి ఫిర్యాదుతో వైద్యులు ఇచ్చిన పత్రాలను కూడా జత చేశామన్నారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే పోలీసులు ఇప్పటి వరకు దాడికి పాల్పడిన వారిపై విచారణ చేయలేదని, తమ ఫిర్యాదు వైపు చూడలేదని ఆరోపించారు. తమ కుటుంబంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని, తమకు రక్షణ కల్పించాలని రమణమ్మ, ఆమె కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు


కాలనీకి వెళ్లే రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాప్ నుంచి బీ-2 జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి వెళ్లే రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. మురుగునీరు బయటకు పోవడానికి వీలుగా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఈ ప్రాంతంలో మురుగునీటి గుంటలు ఏర్పడి.. దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీ వరలక్ష్మీ నమోస్తుతే

- ఇంటింటా 'లక్ష్మీ' శోభ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారు


పూజలందుకున్న కారుషెడ్ బబ్బేలమ్మ


సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారికి కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ


కుంతీ మాధవ స్వామి ఆలయంలో లక్ష్మీదేవి


కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణ


అమ్మవారికి విశేష అలంకరణ

తగరపువలస: వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఇంటింటా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ పూజలు చేశారు. అమ్మవారికి మండపాలు ఏర్పాటు చేసి, పిండివంటలు, పూజా ద్రవ్యాలతో మహిళలు, యువతులు, కొత్త కోడళ్లు వ్రతాలు ఆచరించి చుట్టుపక్కల వారికి వాయినాలు అందించారు. తగరపువలస జాతీయ రహదారి పక్కన విజయదుర్గ ఆలయంలో ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో దాతల సాయంతో 2 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. చిట్టివలస, చిల్లపేట, చిప్పాడ, గుడివాడ, కొండపేట, సంగివలస అమ్మవార్ల ఆలయాలలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

బబ్బేలమ్మ ఆలయంలో..

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో అమ్మవారికి మహిళలు పసుపు కుంకుమలు సమర్పించారు. ఆర్‌హెచ్ కాలనీలోని నూకాలమ్మ, పైడిమాంబ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ శృంగేరీ శంకర మఠంలో శారదాంబ, ఉమాదేవి అమ్మవార్లకు మఠం గౌరవ పాలనాధికారి జగర్లమూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పూజలు చేశారు.

విశేష అలంకరణలో అమ్మవారు

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లోని పలు నివాసాల్లో గృహిణులు అమ్మవారిని విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. కొందరు 21కి పైగా ప్రసాదాలతో పాటు పండ్లను నివేదించారు.

➡ చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, సిద్ధేశ్వర స్వామి పీఠం, కొమ్మాది త్రిశక్తి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. దుర్గాలమ్మ ఆలయంలో చంద్రంపాలేనికి చెందిన పీవీజీ అప్పారావు, యశోద, పిల్లా సూరిబాబు, వరలక్ష్మి, పిల్లా వెంకటరమణ, వరలక్ష్మి దంపతులు ప్రసాదాలు సమకూర్చారు. దుర్గానగర్‌కు చెందిన రుద్రరాజు వెంకటసత్యసారధిరాజు, అరుణ దంపతుల సహకారంతో 300మందికి అన్నప్రసాదం అందించారు.


లక్ష్మీ నారాయణ స్వామికి పూజ చేస్తున్న అర్చకులు

పసుపు కొమ్ముల అలంకరణలో..

భీమునిపట్నం: భీమిలిలోని వాసవి కన్యకాపరమేశ్వరి, కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద దేవస్థానం అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షులు ముమ్మిడిశెట్టి సునీల్ ఆధ్వర్యంలో అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు.

➡ కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పద్మావతి అమ్మవారికి రూ.3లక్షల విలువ చేసే కరెన్సీ నోట్లతో ప్రత్యేకమైన అలంకరణ చేశారు. అర్చకులు అప్పలాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, మహిళలతో సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.


గృహంలో అమ్మవారికి విశేష అలంకరణ

కుంతీ మాధవస్వామి ఆలయంలో..

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవ స్వామి ఆలయంలో లక్ష్మీ దేవి అమ్మవారికి అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

వజ్ర కవచధారణ లో లక్ష్మీ నారాయణ స్వామి

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష్మీనారాయణస్వామి వజ్రకవచ ధారణలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు అష్టలక్ష్మీ హోమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సామూహిక పారాయణం చేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

తగరపువలస: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందారు. వివరాలివి.. ఆనందపురం మండలం గండిగుండం గ్రామానికి చెందిన మదుపాడ రాము(66) శుక్రవారం అదే గ్రామంలో జాతీయరహదారి దాటుతుండగా పెందుర్తి నుంచి తగరపువలస వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తన కుమార్తె గొంతిన వరలక్ష్మి ఇంటికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదానికి గురయ్యాడు. అశోక్ అనే వ్యక్తి మృతుని వివరాలు అతని భార్య దేవుడమ్మకు తెలియజేయగా, ఆమె ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడు స్థానిక కోరమాండల్ పెయింట్స్‌లో లేబర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు నలుగురు కుమార్తెలు కాగా, అందరికీ వివాహాలు అయిపోయాయి. రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఎస్ఐ పి.శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసా కేంద్రానికి తాళాలు


తాళ్లవలసలోని రైతు భరోసా కేంద్ర భవనం


రైతు భరోసా కేంద్రంలో ఆకతాయిలు మద్యం సేవించి పడేసిన బాటిల్స్, గ్లాసులు

తగరపువలస: స్థానికంగా ఉన్న రైతులకు అందుబాటులో ఉండేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో రైతుభరోసా కేంద్రాలు నిర్మించింది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చాలావరకు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను నిర్వీర్యం చేసింది. భీమిలి మండలం తాళ్లవలసలో రెండేళ్ల క్రితం రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఏడాదిగా తెరవడం లేదు. ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక వ్యవసాయశాఖ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసి పని భారం పెంచేశారు. ప్రస్తుతం తాళ్లవలస రైతు భరోసా కేంద్రం తెరవకపోవడంతో ఆకతాయిలు దీనిని చీకటి కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు. టాయిలెట్లను ధ్వంసం చేశారు. ఈ రైతు భరోసా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఇంటింటి కుళాయిలకు శంకుస్థాపన


రెల్లిపేటలో భూమి పూజ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ రెల్లిపేటలో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో ఇంటింటి కుళాయిల నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కుళాయిల నిర్మాణం వల్ల రెల్లిపేట వాసులకు తాగు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

పరిశోధనల్లో ఎన్‌ఎస్‌టీఎల్‌తో భాగస్వామ్యం


ఎన్‌ఎస్‌టీఎల్ అధికారులతో సమావేశమైన అనిట్స్ ప్రొఫెసర్లు

తగరపువలస: విశాఖ ఎన్‌ఎస్‌టీఎల్‌తో సమష్టిగా పని చేస్తూ నీటి అడుగున ఆయుధాలు, వాటి అనుబంధ వ్యవస్థలపై పరిశోధన చేసేందుకు సంగివలస అనిట్స్‌కు చెందిన 12 మంది ప్రొఫెసర్లకు అవకాశం కలిగింది. ఈ సందర్భంగా శుక్రవారం అనిట్స్ బృందం ఎన్‌ఎస్‌టీఎల్‌లోని ప్రయోగశాలను సందర్శించింది. ప్రయోగశాల డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ రక్షణరంగ పరిశోధన, అభివృద్ధి గురించి అక్టోబర్ 3వ వారంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శాస్త్రజ్ఞుల అంతర్గత సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రయోగశాల అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌ఎస్ దాస్, సీనియర్ శాస్త్రవేత్తలు సాజీ, వేణుగోపాలరావు పలు అంశాలను వివరించారు. ఈ బృందానికి అనిట్స్ డైరెక్టర్ కె.శ్రీరామకృష్ణ నాయకత్వం వహించారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్


ఎండాడ - రుషికొండ రహదారి వెంబడి కొనసాగుతున్న వ్యాపారాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ-రుషికొండ రహదారి వెంబడి రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్వహిస్తున్న బడ్డీలను తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గత నెల 25న ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ఆక్రమించి, వ్యాపారాలు నిర్వహించడం వల్ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నందున వాటిని తొలగించాలని ఆదేశించారు. అయితే, ఇప్పటికి దాదాపు 15 రోజులవుతున్నా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మాత్ర చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అనధికార బడ్డీలను తొలగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

చిన్నారుల రాఖీ వేడుకలు


బాలురకు విత్తనాలతో చేసిన రాఖీలు కడుతున్న బాలికలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్పేట సన్‌స్కూల్ వద్ద రాఖీ పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా విత్తనాలతో చేసిన రాఖీలను బాలికలు బాలురకు కట్టారు. పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విత్తన రాఖీల ద్వారా మొక్కలను పెంచాలని సూచించారు.